అధికారుల మాటలకు.. అర్థాలే వేరులే..!

- గ్రీన్‌బెల్ట్ కబ్జాపై ఉత్తుత్తి చర్యలు
- దర్జాగా ఇంటికి రహదారి నిర్మాణం
- జీవీఎంసీ అధికారుల తీరుపై అనుమానాలు
- ఎన్‌ఏడీ ఏరియాలో కొనసాగుతున్న ఆక్రమణల పర్వం


గ్రీన్‌బెల్ట్‌లో మాయమైన పచ్చదనం


గ్రీన్‌బెల్ట్‌కు రక్షణగా హైవేపై ఉన్న ఫెన్సింగ్ తొలగించిన దృశ్యం

విశాఖ విద్య: ఎన్‌ఏడీ ఏరియా గ్రీన్‌బెల్ట్‌లో కబ్జాల పర్వం కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆక్రమణలు జోరుగా సాగుతున్నాయి. ప్రభుత్వ స్థలాలతో పాటు, చివరకు గ్రీన్ బెల్ట్ సైతం కనుమరుగైపోతున్నా, జీవీఎంసీ అధికారులు స్పందించడం లేదని ప్రజానీకం అంటున్నారు. ఎయిర్ట్ పోర్టు నుంచి ఎన్‌ఏడీ జంక్షన్‌కు వచ్చే దారిలో కాకానీనగర్ బస్టాప్ సమీపంలో హైవే పక్కన ఉన్న విలువైన స్థలం ప్రైవేటు వ్యక్తులు తమ స్వప్రయోజనాలకు వినియోగించుకుంటున్న వైనంపై 'సాక్షి' వెలుగులోకి తీసుకొచ్చింది. ఇక్కడి ఆక్రమణల పర్వంపై గత నెల 16న 'గ్రీన్ బెల్ట్ కబ్జా'అనే శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురించింది. దీనిపై జీవీఎంసీ అధికారులు స్పందించారు. టౌన్‌ప్లానింగ్, అదే విధంగా ఉద్యానవన విభాగం అధికారులు కబ్జాకు గురైన ప్రాంతాన్ని పరిశీలించి, 'సాక్షి'కథనంలో ప్రస్తావించిన అంశాలు వాస్తవమే అని తేల్చారు. గ్రీన్ బెల్ట్‌లో ఉన్న చెట్లు కూడా నరికేశారని ధ్రువీకరించారు. ఇదే విషయమై ఉద్యానవన విభాగం అధికారులు ప్రకటన జారీ చేశారు. సదరు ఆక్రమణదారుడికి తీవ్రంగా వార్నింగ్ ఇచ్చామని, చెట్లు నిరికిన ప్రాంతం మొత్తం శుభ్రం చేసి, మళ్లీ అక్కడ మొక్కలు వేసి, వాటి సంరక్షణ బాధ్యతలను కూడా వారికే అప్పగించామని తెలిపారు.

గ్రీన్‌బెల్ట్‌లో కొనసాగుతున్న కబ్జాపర్వం..

భవిష్యత్ అవసరాల కోసం హైవేకు ఆనుకుని ఉన్న గ్రీన్‌బెల్ట్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఎయిర్ పోర్టు మొదలుకుని, నగరంలోని మద్దిపాలెం వరకు గ్రీన్ బెల్ట్‌ను ఆధునికీకరించి, పచ్చని మొక్కలతో పాటు, వాటిలో వాకింగ్ ట్రాక్, వ్యాయామ పరికరాలను ఏర్పాటు చేశారు. దీంతో గ్రీన్‌బెల్ట్‌లు జనసంచారంతో కళకళలాడుతున్నాయి. కానీ ఎన్‌ఏడీ ఏరియాలో మాత్రం కబ్జాల పర్వం కొనసాగుతోంది. ఎయిర్‌పోర్టు నుంచి మారియట్ హోటల్ వరకు గల గ్రీన్ బెల్ట్, దానికి ఆనుకుని ఉన్న స్థలాల్లో రాత్రికి రాత్రే దుకాణాలు వెలుస్తున్నాయి. జిందాల్ భవనం సమీపంలో కూడా ఇదే తంతు కొనసాగుతోంది.

పట్టించుకునే వారేరి..?

ఎన్‌ఏడీ నుంచి ఎయిర్‌పోర్టు వరకు ప్రతిరోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ఈ దారిలో జనసంచారం కూడా అధికంగానే ఉంటుంది. ఈ నేపథ్యంలో ఇరువైపులా రెస్టారెంట్లు, పాన్ షాపులు, హోటళ్లు ఏర్పాటు చేస్తే వ్యాపారం బాగుంటుందని భావిస్తున్న కొంత మంది ప్రైవేటు వ్యక్తులు కూటమి నేతల అండదండలతోనే ఇలా ఆక్రమణలకు పాల్పడుతున్నట్లు ప్రచారం సాగుతోంది. కోట్లాది రూపాయల విలువైన స్థలం కబ్జారాయళ్ల చేతుల్లోకి వెళ్లిపోకముందే కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్ చొరవ తీసుకొని, ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేయాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు. కబ్జారాయళ్లకు సహకరిస్తున్న స్థానిక అధికారులు, సిబ్బందిపై కఠినంగా వ్యవహరిస్తేనే, ఇలాంటి ఆగడాలకు అడ్డుకట్ట పడుతుందని ప్రజానీకం అంటున్నారు.

ఉత్తుత్తి చర్యలేనా..?

ఆక్రమణలు జరిగిన చోటు యథాస్థితిలో ఉండేలా పదిహేను రోజుల్లోనే పనులు చేయిస్తామని జీవీఎంసీ అధికారులు ప్రకటించారు. కానీ ఇది జరిగి 15 రోజులకు పైగా కావొస్తున్నా, అక్కడ ఏమాత్రం తీరుమారలేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉంది. ఒక్క మొక్క నాటిన పాపాన పోలేదు సరికదా.. అక్కడ ఉన్న భవనానికి రహదారి వేసుకునే పనులు మరింత పక్కాగా చేస్తున్నారు. దీన్ని చూసిన వారంతా.. 'జీవీఎంసీ అధికారుల మాటలకు అర్థాలే వేరులే 'అంటూ పెదవి విరుస్తున్నారు. అధికారుల తీరుపై అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.


గ్రీన్‌బెల్ట్‌లో రహదారిని పటిష్టం చేస్తున్న దృశ్యం

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

విశాఖ విద్య : గోపాలపట్నం మండల పరిధిలో సోమవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ చావలి వెంకట రమేష్ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రజానీకం సౌకర్యార్థం ఈ నెల 26 వరకు సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 9న బుచ్చిరాజుపాలెం (ఎన్‌ఎస్‌టీఎల్ ఫ్యామిలీ గేటు ఎదురుగా), 12న గోపాలపట్నం (గాంధీనగర్ గ్రౌండ్), 13న కంచరపాలెం (ఏఎస్ఆర్ నగర్ - 02 సచివాలయం), 16న కంచరపాలెం (కాగిత పైడియ్య కళ్యాణ మండపం, ఐటీఐ జంక్షన్), 17న వెంకటాపురం (కంపరపాలెం అంగన్‌వాడీ సెంటర్ సచివాలయం)లో సదస్సులు నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా 19న పుల్లంబట్లపాలెం (సంతోష్ నగర్ మొదటిలైన్, యల్లపువానిపాలెం - 02 సచివాలయం), 21న కప్పరాడ (మురళీనగర్ - 04 సచివాలయం, హైవే శివాలయం పక్కన), 23న మాధవధార (మాధవ స్వామి కల్యాణమండపం), 26న మర్రిపాలెం (మసీద్ స్ట్రీట్ వార్డు సచివాలయం) నందు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ఆయా ప్రాంతాల్లోని ప్రజానీకం రెవెన్యూ పరమైన సమస్యలను తెలియజేసుకోవచ్చన్నారు. ఆయా రోజుల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు సదస్సుల్లో అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రేషన్ బియ్యం పట్టివేత

అక్కిరెడ్డిపాలెం: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గాజువాక పోలీసులు పట్టుకున్నారు. గాజువాక సీఐ ఎ.పార్థసారథి ఆదివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మల్కాపురానికి చెందిన అచ్చిబాబు అనే వ్యక్తి వ్యానులో సుమారు రెండు టన్నులకు పైగా రేషన్ బియ్యాన్ని సబ్బవరం తరలిస్తున్నట్లు స్పెషల్ బ్రాంచ్ పోలీసులు గాజువాక పోలీసులకు సమాచారం అందించారు. వ్యాను మింది గ్రామం నుంచి వెళ్తున్నట్లు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ రాధాకృష్ణ సిబ్బందితో కలిసి దాడి చేసి వ్యానుతో పాటు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

క్లుప్తంగా

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం: జ్ఞానాపురం కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా ఆధ్వర్యంలో అర్చకులు శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్‌బాబా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆలయ సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, స్వచ్ఛంద సంస్థ సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

చెస్ విజేతలకు బహుమతులు


మెమెంటోలతో చెస్ విజేతలు

కంచరపాలెం : జీవీఎంసీ 57వ వార్డు ఊర్వశి కూడలి సుభాష్‌నగర్‌లో జ్ఞానసాయి చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన చెస్ పోటీల్లో విజేతలకు రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ పెంటకోట అజయ్‌బాబు మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. చెస్‌తో చిన్నారుల మేధోశక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో చెస్ నిర్వాహకులు సూర్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

దంతాలను నిర్లక్ష్యం చేయొద్దు


శిబిరంలో పరీక్షిస్తున్న వైద్యురాలు

మల్కాపురం : దంతాలే కదా అని నిర్లక్ష్యం చేయొద్దని, ప్రతీ ఆరు నెలలకు ఒకసారైనా పరీక్షించుకోవాలని దంత వైద్య నిపుణులు ఎం.కీర్తి సూచించారు. భాను కిడ్స్ పాఠశాల ఆధ్వర్యంలో 60వ వార్డు జవహరనగర్‌లో ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ వి.డి.ఈ.రావు సౌజన్యంతో విద్యార్థులకు దంత పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందించారు. అనంతరం వైద్యురాలు కీర్తి మాట్లాడుతూ చిన్నారులు తీపి పదార్థాలు తిన్న వెంటనే దంతాలు శుభ్రం చేసుకోవాలని సూచించారు.

అలరించిన హాస్య వల్లరి


స్కిట్ ప్రదర్శిస్తున్న కళాకారులు

సీతంపేట : విశాఖ హ్యూమర్ క్లబ్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం సాయంత్రం హాస్యవల్లరి పేరిట ప్రదర్శించిన కామెడీ స్కిట్స్ ఆద్యంతం నవ్వులు పండించాయి. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రావి గోపీకృష్ణ, ఎస్.ఎస్.రామానుజం నేతృత్వంలో క్లబ్ కళాకారులు భానుప్రకాష్, ఆర్ఎస్ఎస్ మూర్తి, డీఎస్ఎన్ మూర్తి, నాగ గణేష్, శివజ్యోతి ప్రదర్శించిన స్కిట్స్ ప్రేక్షకులను నవ్వించాయి. ఇటీవల కీర్తిశేషులైన బాదంగీర్ సాయి, చింతా ప్రభాకర్ ఆత్మలు శాంతించాలని క్లబ్ సభ్యులు మౌనం పాటించారు.

భగవద్గీత పఠన పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ


ప్రతిభ చాటిన విద్యార్థినులు

విశాఖ విద్య: తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన భగవద్గీత పఠన పోటీల్లో శాంతినగర్‌లో ఉన్న శ్రీ రామకృష్ణా పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటుకున్నారు. 7,8,9 తరగతులు చదువుతున్న విద్యార్థినులు పాల్గొని ప్రథమ, ద్వితీయ తృతీయ బహుమతులు సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. లక్ష్మీ నళిని పేర్కొన్నారు. ఈ పోటీల్లో సుమారు 54 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో 7వ తరగతి విద్యార్థిని ఎం.భానుశ్రీ, ద్వితీయ బహుమతి సాధించగా, 8వ తరగతి విద్యార్థిని పి. కీర్తన ప్రథమ బహుమతి సాధించింది. అదే తరగతి చదువుతున్న జి. సమీరా ద్వితీయ బహుమతి. పి. తేజశ్రీ తృతీయ బహుమతి సాధించింది. విజేతలకు రూ. 1000, రూ.750, రూ.500 చొప్పున నగదు పురస్కారాలతో పాటు భగవద్గీత, రామాయణం పుస్తకాలను నిర్వాహకులు అందజేశారు. బహుమతులు సాధించిన విద్యార్థినులను పాఠశాల డైరెక్టర్ ఎ.కృష్ణారెడ్డి ఆశీర్వదించి జీవితంలో మరిన్ని ఘన విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు ఎ. విజయలక్ష్మి శిక్షణ ఇచ్చారు. ప్రిన్సిపాల్ జి. రవీంద్రుడు, వైస్ ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనందించారు.

అయ్యప్ప భక్తులకు మహా అన్న సమారాధన


అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు శాంతినగర్ సుబ్రహ్మణ్య స్వామి ఆలయం శ్రీ వల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్యస్వామి వారి 27వ షష్ఠి కల్యాణ మహోత్సవంలో భాగంగా ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ఆర్.మాణిక్యం, కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు, అయ్యప్ప స్వాములకు అన్న సమారాధన నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఉదయం ఆలయ ప్రధానార్చకులు ఆకెళ్ల సూర్యప్రకాష్ రావు, ఓలేటి చంద్రశేఖర్ శర్మ, స్వామి వారికి ఉదయం పంచామృతాభిషేకం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణం వద్ద భక్తులకు, అయ్యప్ప స్వాములకు అన్న సమారాధన నిర్వహించారు. పరిసర ప్రాంత భక్తులు 5 వేల మంది హాజరై స్వామివారి అన్న ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం 6 గంటలకు జ్యోతిర్లింగార్చన (వేయి దీపాలతో) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

గోతులు పూడ్చక ఇబ్బందులు


నక్కవానిపాలెం సేవా మార్గంలో సరిగ్గా పూడ్చకపోవడంతో రోడ్డుపై మట్టి

మల్కాపురం : పైపులు వేసేందుకు తవ్విన సేవా మార్గాన్ని పూర్తిస్థాయిలో పూడ్చకపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. జీవీఎంసీ 59వ వర్డు పరిధి పాత చెక్‌పోస్టు ఏరియా నుంచి నక్కవానిపాలెం వరకు గల మార్గంలో భూగర్భం ద్వారా పైపులైన్ ఏర్పాటు పనులు గత వారం రోజుల నుంచి చేపడుతున్నారు. పైప్‌లైన్ పని పూర్తయినప్పటికీ గోతులను సదరు కాంట్రాక్టర్ తూతూమంత్రంగా పూడ్చారు. దీంతో ఆ మార్గంలో రాకపోకలకు వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పలుచోట్ల గుంతల మాదిరిగా ఉండటంతో ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో గోతులు పూడ్చేలా చర్యలు చేపట్టాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

పాలకులకు మంచి ఆలోచనలు కలగాలి

- త్రిదండి చిన జీయర్ స్వామి
- వైభవంగా శ్రీరామ పాదుకా ఆరాధన



ప్రసంగిస్తున్న త్రిదండి చిన జీయర్‌స్వామి

సీతమ్మధార : దేశ, రాష్ట్ర అభివృద్ధి కోసం పాలకులకు మంచి ఆలోచనలు కలగాలని భగవంతుని ప్రార్థిద్దామని త్రిదండి చిన జీయర్ స్వామి పిలుపునిచ్చారు. సీతమ్మధారలో శ్రీరామ పాదుకా ఆరాధన పూజలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. గీతా జయంతి వేడుకల్లో భాగంగా ఆయన అనుగ్రహభాషణం చేశారు. అనంతరం భక్తులతో స్వయంగా శ్రీరామ పాదుకా ఆరాధన పూజలు నిర్వహించారు. జీయర్ స్వామి స్వయంగా భక్తులు అందరికీ శ్రీరామ పాదుకలు అందించి, శ్రీరామ సహస్ర నామాలతో పూజ చేయించారు. దేశం, రాష్ట్రం అభ్యున్నతి కోసం మన వంతుగా స్వామిని ప్రార్థిద్దామన్నారు. అంతకుముందు కోలాటం, భజనలు, వేద పారాయణతో భారీ ఊరేగింపుగా శ్రీరామ పెరుమాళ్‌ను ప్రవచన మండపంలోకి జీయర్ స్వామి తీసుకొచ్చారు.

మానవ జీవితానికి లక్ష్యం అవసరం

కేవలం తినడం కోసమే ఉపయోగపడే చదువు దండగ అని, మానవ జీవితానికి ఒక లక్ష్యం ఉండాలని త్రిదండి చిన్న జీయర్ స్వామి సూచించారు. కేవలం తినడమే లక్ష్యమైతే మనిషికి, ఇతర జీవులకు తేడా ఉన్నట్టా ? లేనట్టా అని ప్రశ్నించారు. మనం అభ్యసించే విద్యకు ఒక పరమావధి ఉండాలన్నారు. గతంలో గురుకుల, ఆశ్రమ విద్యా విధానం ద్వారా ఎంతో ఉన్నత విజ్ఞానం సంపాదించడంతోపాటు, సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడేదన్నారు. మందులు వాడాల్సిన అవసరం లేని సమాజం కోసం మనిషి విజ్ఞానం వాడాలని జీయర్ స్వామి సూచించారు. చదివిన చదువుకు ఒక లక్ష్యం ఉండాలని, ఆదాయం సంపాదించడమే ముఖ్యం కాకూడదన్నారు. కార్యక్రమంలో వికాస తరంగిణి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ఎస్ఆర్ వర్మ, వారీజ వేద పాఠశాల అధ్యాపకులు ముడుంబై శ్రీకాంత్ స్వామి, సంతోష్ కుమార్ స్వామి, సభ్యులు ఎంఎస్ రాజు, కాశీ రాజు, సాతులూరి రామానుజం, నారాయణ రెడ్డి, నేత్ర విద్యాలయ నిర్వాహకులు శిరీష, తదితరులు పాల్గొన్నారు.

ఆటో అప్పగింత


యజమానికి ఆటో అప్పగిస్తున్న క్రైమ్ పోలీసులు

గోపాలపట్నం: ఇటీవల దొంగతనానికి గురైన ఆటోను ఎయిర్‌పోర్టు క్రైమ్ పోలీసులు పట్టుకుని ఆటో యజమానికి ఆదివారం అందించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జాకీర్‌హుస్సేన్ నగర్‌కు చెందిన జి. సంతోష్ ఈ నెల 5న ఇంటి వద్ద రాత్రి సమయంలో తన ఆటో (ఏపీ 31టీపీ 1419)ని పార్క్ చేశాడు. ఉదయం లేచి చూసేసరికి ఆటో లేకపోవడంతో ఎయిర్‌పోర్టు క్రైమ్ పోలీసుకు ఫిర్యాదు చేశాడు. వెస్ట్‌జోన్ క్రైమ్ సీఐ నిమ్మకాయల శ్రీనివాసరావు పర్యవేక్షణలో హెడ్ కానిస్టేబుల్ నరేష్‌కుమార్, కానిస్టేబుల్ జానకిరామ్, హోమ్‌గార్డు ప్రసాద్ దర్యాప్తు చేపట్టారు. దొంగిలించబడిన ఆటోను నరసింహనగర్ వద్ద గుర్తించారు. దాన్ని స్వాధీనం చేసుకుని సీఐ ఆదేశాల మేరకు ఆటో యజమానికి అప్పగించారు. దర్యాప్తులో ప్రతిభ చూపిన పోలీస్ సిబ్బందిని సీఐ శ్రీనివాసరావు అభినందించారు.

మానవ హక్కుల పరిరక్షణపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న గాంధీ సెంటర్ అధ్యక్షుడు బాలమోహన్‌దాస్

సీతంపేట : మానవ హక్కుల పరిరక్షణకు రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులతోపాటు ఆదేశ సూత్రాలకు కూడా పూర్తి స్థాయిలో చట్టబద్ధత కల్పించాల్సిన అవసరం ఉందని గాంధీ సెంటర్ అధ్యక్షుడు వి.బాలమోహన్‌దాస్ అన్నారు. బీవీ ఫౌండేషన్, ఐఏఆర్ఎఫ్ సంస్థల ఆధ్వర్యంలో బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో మానవ హక్కుల దినోత్సవ ప్రత్యేక సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా సందర్భాల్లో హక్కుల పరిరక్షణ సాధ్యం కావడం లేదన్నారు. యువతకు హక్కులపై అవగాహన కల్పించడం అవసరమన్నారు. బీవీ ఫౌండేషన్ చైర్మన్ నరవ ప్రకాశరావు మాట్లాడుతూ గౌరవం, స్వేచ్ఛ, అందరికీ న్యాయం సాధించడంలో యువత అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆచార్య పద్దయ్య, కె.వి.ఎస్.ఎస్.మూర్తి, మున్నార్, గోపాల్, రామేశ్వరి, అనిత, సూర్యనారాయణ, సత్యవతి, మంత్రి శ్యాం ప్రసాద్, గౌరి పాల్గొన్నారు.

చైల్డ్‌లైన్‌కు బాలిక అప్పగింత


బాలికతో షెల్టర్ మేనేజర్ జ్యోతిర్మయి

సీతమ్మధార: వన్‌టౌన్ ఏరియాలో ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ దగ్గర రెండు రోజుల నుండి హాసిని (7) ఒంటరిగా కూర్చుని ఏడుస్తూ ఉంటే పెట్రోల్ బంక్ సిబ్బంది ద్వారకా నగర్ లోని ఏయూటీడీ జీవీఎంసీ షెల్టర్‌కు సమాచారం అందించారు. దీంతో షెల్టర్ మేనేజర్ జ్యోతిర్మయి అక్కడికి వెళ్లి బాలికను కలుసుకున్నారు. తిండి లేక నీరసించిపోయిన పాపకు మంచినీరు, అల్పాహారం అందించారు. అనంతరం టీఎస్సార్ మహిళా షెల్టర్ హోంకు ఆదివారం తీసుకొచ్చారు. బాలిక అమ్మ చనిపోయిందని, తండ్రి చెత్త ఏరుకుని వచ్చిన డబ్బులతో బాగా తాగి తనను కొడుతున్నాడని పాప తెలిపింది. రాత్రి ఒంటరిగా వదిలేసి ఎక్కడికో వెళ్లిపోయాడని చెప్పింది. పాప తదుపరి సంరక్షణ కోసం 1098కి ఫోన్ చేసి చైల్డ్‌లైన్ సిబ్బంది ప్రశాంత్‌కు అప్పగించారు.

ఈ దిమ్మ నిర్మాణం దేని కోసం?


ఐటీఐ కూడలి ఫుట్‌పాత్‌పై దిష్టిబొమ్మలా ఉన్న సిమెంట్ దిమ్మ

కంచరపాలెం: జీవీఎంసీ 57వ వార్డు ఐటీఐ జంక్షన్ బీఆర్‌టీఎస్ రహదారి పెట్రోల్ బంక్‌కు ఆనుకుని ఉన్న ఫుట్‌పాత్‌పై ఐదడుగుల సిమెంట్ దిమ్మ నిర్మించారు. అయితే ఈ నిర్మాణం దేని కోసం చేపట్టారో గాని దానిని నిర్లక్ష్యంగా వదిలేశారు. జోన్-5 ఇంజినీరింగ్ అధికారులు నిర్మించారో? ఏపీఈపీడీసీఎల్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ కోసం నిర్మించారో అర్థం కాని పరిస్థితిలో ఇది దిష్టిబొమ్మలా కనిపిస్తుందని స్థానికులు వాపోతున్నారు. దిమ్మకు ఆనుకుని వాహనాల పార్కింగులు, వ్యాపారాలు జరుగుతున్నాయి. నిత్యం అటుగా రాకపోకలు సాగించే పాదచారులు ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. నిర్మాణం చేపట్టి సుమారు 5 నెలలు గడుస్తున్నా ఈ దిమ్మ రహదారికి అడ్డంగా ఉంది కానీ.. దీన్ని దేనికీ ఉపయోగించడం లేదు. దీంతో ఈ దిమ్మ అడ్డంగా ఉందని స్థానికులు, పాదచారులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు.

అక్రమ సస్పెన్షన్లు ఎత్తివేయాలి


బైక్ ర్యాలీలో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు, కార్మికులు

సీతమ్మధార: ఎన్‌ఏడీలో 36 మంది కార్మికులను సస్పెండ్ చేసి, ఆరుగురిపై పోలీస్ కేసు పెట్టిన మేనేజ్‌మెంట్ ఏకపక్ష చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ బి. గంగారావు అన్నారు. ఆదివారం ఉదయం ఎన్‌ఏడీసీఈ యూనియన్ దీక్షా శిబిరం నుండి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరిగిన సమావేశంలో గంగారావు మాట్లాడారు. విశాఖ చరిత్రలో ఏ పరిశ్రమలోనూ ఇంత మందిని సస్పెండ్ చేయలేదని చెప్పారు. ఎన్‌ఏడీ మేనేజ్‌మెంట్ సస్పెన్షన్లు, పోలీస్ కేసు ఎత్తివేసి, కార్మికుల కష్టార్జితం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకపోతే విశాఖలో ఉన్న ట్రేడ్ యూనియన్లతో పాటు రాజకీయ పార్టీలను ఐక్యం చేసి పోరాడుతామన్నారు. సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి. కుమార్ మాట్లాడుతూ సస్పెన్షన్లు రద్దు చేయాలని రక్షణ మంత్రికి మెయిల్స్ పంపిస్తామని చెప్పారు. పబ్లిక్ రంగ సంస్థల సమన్వయ కమిటీ కన్వీనర్ కుమార మంగళం మాట్లాడుతూ ఉద్యమానికి అండగా ఉంటామని తెలిపారు. డిఫెన్స్ కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ రెడ్డి వెంకటరావు దేశ రక్షణ రంగంలో జరుగుతున్న పరిణామాలను వివరించారు. ఈనెల 6 నుండి 12వ తేదీ వరకు విక్టిమేజేషన్ వ్యతిరేక కార్యక్రమాలు జరుపుతున్నామని అందులో భాగంగానే బైక్ ర్యాలీ నిర్వహించామని తెలిపారు. టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి కె. నాగార్జున, అరుణ్ శ్రీనివాసరావు, ఎంఈఎస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి దీన్ అహ్మద్, జేసీఎం సభ్యులు భాను, శేఖర్ ఎన్‌ఏడీ సివిల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఆర్. శ్రీనివాస్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వెటరన్ సెయిలర్స్ ఫోరం సమావేశం


వెటరన్ సెయిలర్స్ ఫోరం సమావేశంలో మాజీ నావికులు, అధికారులు

సింధియా : వైజాగ్ చార్టర్ వెటరన్ సెయిలర్స్ ఫోరం సమావేశం తూర్పు నావికాదళం ఆధ్వర్యంలో ఆదివారం సింధియాలోని సముద్రిక ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి రియర్ అడ్మిరల్ ఎం.మురళీమోహన్‌రాజు అధ్యక్షత వహించారు. విశాఖపట్నం చుట్టుపక్కల నివసించే అనుభవజ్ఞులైన నావికులు, సహోరా మహిళలు సుమారు 500 మంది ఈ సమావేశంలో పాల్గొన్నారు. నావికుల సంక్షేమానికి సంబంధించి పలు సమస్యలపై చర్చించడంతోపాటు ముందస్తు ప్రణాళికలను రూపొందించారు. మాజీ సైనికుల ఆరోగ్యం, సంక్షేమానికి సంబంధించిన పలు విషయాలను రీజినల్ డైరెక్టర్, కమాండ్ రెజిమెంటల్ సిస్టమ్ ఆఫీసర్ వివరించారు.